
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సిద్దిపేట
5
గురువారం 28 నవంబరు 2024



మల్లన్న ఆలయంలో ఫైళ్లు మాయం!

- ఆడిట్ అభ్యంతరాలపై నివేదిక తయారీకి కసరత్తు
- అందుబాటులో లేని ఫైల్స్
- ముగ్గురికి నోటీసులు..



చేర్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలోని పలు విభాగాలకు సంబంధించిన ఫైళ్లు మాయమవడం కలకలం రేపుతున్నది. మల్లన్న ఆలయంలో ఏప్రిల్ 2014 నుంచి మార్చి 2017 వరకు చేపట్టిన ఆదాయ, వ్యయాలపై పలు అవినీతి ఆరోపణలు రాగా, సుమారు ఐదున్నరేళ్లక్రితం ఆడిటర్ లక్ష్మీనారాయణ ఆడిట్ నిర్వహించి 54 అంశాలలో రూ.3కోట్లకుపైగా లావాదేవీలపై అభ్యంతరాలు వ్యక్తంచేశారు. అందులో ఎంబీ రికార్డుల లేని మరమ్మతులు రూ.70.19లక్షలు, అనుమతిలేని ప్రహరీ నిర్మాణానికి రూ.20.91 లక్షలు, ఒరిజినల్ బిల్లులు లేని ఉద్యోగుల అడ్వాన్సులు రూ.14.84 లక్షలు, అతిథుల భోజనాలు రూ.5.34 లక్షలు, వాహనాల అద్దె రూ.4.56 లక్షలు, దుస్తులు రూ.13.96లక్షలు, మొక్కలపెంపకం రూ.3.63 లక్షలు, వేలంపాట బకాయిలు రూ.22.29 లక్షలు, ఆలయ సిబ్బంది బ్యాంకుల్లో చెక్కుల ద్వారా విడుదల చేసిన రూ.33.26 లక్షలతో పాటు ఇతరత్రా వ్యయాలు ఉన్నాయి. దీనిపై 2018లో దేవాదాయశాఖ కమిషనర్ స్పందించి మూడేళ్ల కాలంలో పనిచేసిన ఐదుగురు ఈవోలు, ఆయావిభాగాలలో పనిచేసిన 11మంది ఉద్యోగులను సంజాయిషీ కోరగా పలువురు ఎంబీ రికార్డులు, బిల్లులు సమర్పించారు. ఇంకా సుమారు రూ.1కోటికి పైగా సంబంధించి ఆధారాలు చూపించకపోవడంతో రికవరీకి అప్పట్లోనే ఉత్తర్వులిచ్చినా ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుత ఈవో బాలాజీశర్మ మరో నెలరోజుల్లో రిటైర్‌మెంట్ కానుండటంతో ఆడిట్ అభ్యంతరాల ఫైల్ క్లియర్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో సదరు ఫైళ్లు కనిపించకపోవడంతో అప్పట్లో ఉద్యోగులుగా పనిచేసిన ముగ్గురికి మెమోలు జారీచేశారు. దీనిపై ఈవో బాలాజీశర్మను సంప్రదించగా సెంట్రల్ స్టోర్‌కు సంబంధించిన పలు రికార్డులు అందుబాటులో లేవని, దీంతో అప్పట్లో స్టోర్ బాధ్యతలు చేపట్టిన ముగ్గురు ఉద్యోగులకు మెమోలు జారీ చేశామని ఆయన పేర్కొన్నారు.

చెరువులకు చెర



గజ్వేల్ మండలం పిడిచెడ్ గ్రామంలోని చెన్న సముద్రం చెరువు

ఒకప్పుడు ఊరుకు ఆదెరువైన చెరువులు.. నేడు ఆక్రమణలతో ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. గజ్వేల్ మండంలోని పలు చెరువులు, కుంటలు కబ్జాదారుల కోరల్లో చిక్కుకుని కుచించుకుపోతున్నాయి. నీరున్నా దర్జాగా ఆక్రమించి మోటార్లతో నీటి తోడేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తుండడంతో అక్రమార్కుల ఆగడాలకు అదుపులేకుండా పోతోంది. కొడకండ్లలో చెరువును భూమిని కబ్జా చేసి ఏకంగా ఒకరికి విక్రయించారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

- పిడిచెడ్ గ్రామంలోని చెన్నసముద్రం 55కు మిగిలింది 30 ఎకరాలే
- కొడకండ్లలో ఏకంగా విక్రయం
- ఆక్రమించి నీటిని తోడేస్తున్న వైనం
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- రక్షణ చర్యలు తీసుకోవాలని వేడుకోలు

గజ్వేల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణలు అడ్డేది కాదన్నట్లుగా మారింది పరిస్థితి. గజ్వేల్ మండలంలోని పలు చెరువులు, కుంటలు కబ్జాకు గురై కనుమరుగవుతున్నాయి. నీళ్లున్నా వదలడంలేదు. పిడిచెడ్, కొడకండ్ల గ్రామాల్లో కొన్నాళ్లుగా కబ్జాల పర్వం కొనసాగుతూనే ఉన్నది. ఇటీవల కాలంలో పిడిచెడ్ లోని చెన్నసముద్రం చెరువు ఆక్రమణపై గ్రామస్థులు అధికారుల ఫిర్యాదు చేయడంతో స్పందించిన తహసీల్దారు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. కొడకండ్లలోని రామరాజు చెరువు ఆక్రమించడమే కాకుండా కొంత భూమిని నోటరీ ద్వారా ఇతరులకు విక్రయించినట్లు తెలిసింది. అయినా నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు మిన్నకుండిపోవడంతో కబ్జాదారులు మరింత రెచ్చిపోతున్నారు.

55 ఎకరాలకు 30 మిగిలింది..

పిడిచెడ్‌లోని చెన్నసముద్రం చెరువు విస్తీర్ణం 55 ఎకరాల 6గుంటలు కాగా, అక్రమార్కుల చేతివాటంతో ప్రస్తుతం 30 ఎకరాలు కూడా లేదు. రోజురోజుకూ ఆనవాళ్లు లేకుండపోతుండడంతో చెరువుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులను గుర్తించాలని గ్రామస్థుడు ప్రభాకర్ ఇటీవల తహసీల్దారు, ఆర్డీవో, కలెక్టర్‌లకు వినతిపత్రాలను అందజేశారు. దీంతో గజ్వేల్ తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ 25 మందికి నోటీసులు జారీ చేశారు. చెరువులో శిఖం భూమి పొజిషన్‌లో ఉన్నట్లు గుర్తించామని, అందుకు సంబంధించిన ఆధారాలను సమర్పించాలని, లేనిపక్షంలో జీవోఎంఎస్ 157(ఎంఏడీ) ప్రకారం చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ చెరువులో నీటిని సైతం మోటార్లను బిగించి

- మిగతా 8వ పేజీలో...

ఆక్రమణదారులకు నోటీసులిచ్చాం..

పిడిచెడ్ చెన్నసముద్రం కబ్జాకు గురైనట్లు గుర్తించి ఆక్రమణదారులకు చట్టప్రకారం నోటీసులు జారీ చేశాం. ఈ విషయమై త్వరలోనే చర్యలు తీసుకుంటాం. నీటిపారుదల శాఖ అధికారులతో కలసి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులను నిర్దేశిస్తాం. కొడకండ్లలోని రామరాజు, నల్లచెరువులకు సంబంధించిన భూములపై కూడా విచారణ జరుపుతాం. శిఖం భూములను ఆక్రమిస్తే ఎంతటివారైనా ఊరుకునే ప్రసక్తే లేదు.

-శ్రావణ్‌కుమార్, తహసీల్దార్

పూర్తిస్థాయి మండలాలుగా అక్బర్‌పేట-భూంపల్లి, దూళిమిట్ట

- జీవో విడుదల చేసిన ప్రభుత్వం
- 'స్థానిక సమరం' కోసం పార్టీల ఎదురుచూపు

దుబ్బాక/మిరుదొడ్డి, నవంబరు27(ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి, దూళిమిట్టలను పూర్తిస్థాయి మండలాలుగా ప్రభుత్వం గుర్తింపునిచ్చింది. దుబ్బాక మండలం నుంచి పోతరెడ్డిపేట, తాళ్లపల్లి, నగరం, రామేశ్వరంపల్లి, చిన్ననిజాంపేట, చౌదర్‌పల్లి, ఎనగుర్తి, బొప్పాపూర్, చిట్టాపూర్.. మిరుదొడ్డి మండలంనుంచి మోతే, రుద్రారం, జంగపల్లి, వీరారెడ్డిపల్లి, అల్మాస్‌పూర్, ఖాజీపూర్, బేగంపేట, అక్బర్‌పేట, భూంపల్లి, కూడవెల్లి, మాదన్నపేట(మదిర గ్రామం) గ్రామాలతో గత ప్రభుత్వం అక్బర్‌పేట-భూంపల్లి మండలాన్ని ఏర్పాటు చేసింది. అయినా వాటికి పూర్తిస్థాయి కార్యాలయాలను కూడా సమకూర్చలేకపోయింది. అంతేకాకుండా స్థానిక సంస్థల పాలక సమయం పూర్తి కాకపోవడంతో సాంకేతిక కారణాలతో దుబ్బాక, మిరుదొడ్డి మండలాలకే ఎంపీటీసీలు, సర్పంచులు అనుబంధంగా ఉన్నారు. ఇటీవల వారి కాలపరిమితి కూడా పూర్తి అయ్యింది. స్థానిక సంస్థల ఎన్నికలు కూడా సమీపిస్తుండటంతో ప్రస్తుత ప్రభుత్వం మండలపరిషత్ పాలకమండలి పూర్తిస్థాయిగా ప్రకటిస్తూ జీవో నంబర్ 67ను బుధవారం విడుదల చేసింది. దీంతో రానున్న ఎన్నికల్లో కొత్తపాలక మండలి కొలువు తీరనున్నది. ఈ నేపథ్యంలో స్థానిక సమర శంఖారావం పూరించి, సమరోత్సవానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఎప్పుడు ఇస్తుందా అని ఆయా గ్రామాల్లోని ఔత్సాహికులు, ఆయా రాజకీయ పార్టీల నేతలు ఎదురు చూస్తున్నారు. కొత్తమండలంలో కొత్తపాలకమండలికి ఏ రిజర్వేషన్ కలిసివస్తుందో..? జడ్పీటీసీ, ఎంపీపీలుగా ఎవరికీ అవకాశం కలుగుతుందోనని ప్రధాన పార్టీల నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు.

కాంగ్రెస్ శ్రేణుల హర్షం..

అక్బర్‌పేట- భూంపల్లి, దూళిమిట్టలకు పూర్తిస్థాయి మండలపరిషత్ కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలను జారీ చేయడంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలానికి సంబంధించి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకటస్వామిగౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, బాలు యాదవ్, అనసూయ, బాల్తె వెంకటేశం, బొమ్మెర శ్రీధర్ తదితరులు ఆనందం వ్యక్తం చేశారు.



అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో ఆనందం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మళ్లీ రంగంలోకి హైడ్రా..!

- ఫిర్యాదుల నేపథ్యంలో చెరువుల పరిశీలన
- గ్రేటర్‌తోపాటు శివార్లలోని చెరువుల సందర్శన

7



మేళ్ల చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

నేటి నుంచి వైజ్ఞానిక ప్రదర్శన

- మూడు రోజులపాటు నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి

సిద్దిపేట కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, 52వ రాష్ట్రీయ బాలల వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనకు సిద్దిపేట బాలికల ఉన్నత పాఠశాల (డా. ఏపీజే అబుల్ కలాం ప్రాంగణం) వేదిక కానుంది. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు 188 ఇన్‌స్పైర్ ఎగ్జిబిట్స్, 250 సైన్స్ ఎగ్జిబిట్స్ ప్రదర్శించనున్నారు. 13 కమిటీలు, 13 మంది కన్వీనర్లు, 150 మంది కో కన్వీనర్లు, 450 మంది గైడ్ టీచర్లు విధులు నిర్వర్తించనున్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రదర్శనను విజయవంతం చేయాలని అధికారులు సూచించారు.

సంక్షోభాల పాలు

విజయ డెయిరీకి ఆదరణ కరువు

- తగ్గిన విక్రయాలు
- ప్రైవేటుతో పోల్చితే ధరలు అధికంగా ఉండడమే కారణం
- పెరిగిన భారంతో రైతులకు అందని బిల్లులు
- ప్రోత్సాహకం, నిర్వహణ ఖర్చులు, సబ్సిడీలూ అంతే...
- అంధకారంలో భవితవ్యం

దుబ్బాక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు సంస్థల పోటీని తట్టుకోలేక విజయ డెయిరీ సంస్థ సంక్షోభంలో పడింది. ప్రైవేటు సంస్థలు పాల ధరలను తగ్గించడం.. విజయ పాలు ధరలు ఎక్కువగా ఉండడంతో వినియోగదారులు విజయపాలను కొనేందుకు ఆసక్తి చూపడంలేదు. దీంతో మార్కెటింగ్ మందగించి రైతులకు సకాలంలో బిల్లులను చెల్లించలేని స్థితికి చేరుకున్నది. మరోవైపు ప్రైవేటు సంస్థలు సకాలంలో పాడి రైతులకు బిల్లులు అందిస్తుండడంతో 'విజయ' భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్నది. ప్రభుత్వం ఇటీవల సిద్దిపేట జిల్లాకు విడుదల చేసిన రూ.50 కోట్లు పాత బకాయిలకే సరిపోయాయి. దీంతో మరో రూ.50 కోట్లు అందిస్తామని ప్రకటించింది. జిల్లాలో సుమారు రూ.7 కోట్ల పైచిలుకు రైతులకు బకాయిలు ఉండటంతో సకాలంలో బిల్లులు రాక, పాడి రైతులు అయోమయానికి గురవుతున్నారు. జిల్లాలోని సుమారు 180 పాడిపరిశ్రమ సహకార సంఘాలు, 125 నాన్ సొసైటీలు ఉండగా, సుమారు 7,400 పాల ఉత్పత్తిదారులున్నారు. జిల్లాలో నిత్యం 32వేల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఇదివరకు 15 రోజులకోకసారి పాల బిల్లులను విజయ డెయిరీ చెల్లించేంది. దీంతో ఈఎంఐలు, బ్యాంకు, తదితర రుణాలను రైతులు సకాలంలో కట్టుకునేవారు. గతేడాది నుంచి సక్రమంగా బిల్లులు రాకపోవడంతోపాటు గత మూడు, నాలుగు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు రాక సకాలంలో రుణాలను చెల్లించలేక సతమతమవుతున్నారు. ప్రైవేటు వ్యక్తుల వద్ద పాడిగేదెల కొనుగోలు, ఇతర అవసరాలకు తెచ్చుకున్న అప్పు తడిసి మోపడంతోపాటు వడ్డీలు పెరగడంతో ఎట్ల తీర్చాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దుంపలపల్లి పాల కేంద్రంలో పాలసేకరణ

అందని ప్రోత్సాహకాలు..

గతంలో టీఐపీ (సాంకేతిక వనరుల కార్యక్రమం) ద్వారా రైతులకు ప్రోత్సాహకాలను అందించేవారు. ఆవు పాలకు రూ.2, గేదే పాలకు రూ.4 చొప్పున అందించే ఈ నిధులను 15 నెలలుగా ప్రభుత్వం ఇవ్వడంలేదు. అంతేకాకుండా 70శాతం సబ్సిడీతో దాణా, గడ్డివిత్తనాలు, పాల ఉత్పత్తి పెరగడానికి మినరల్స్, ద్రవరూప కాల్షియం, కల్యాణలక్ష్మి పొందిన రైతులకు మరో రూ.5116 విజయ పాల ఉత్పత్తి సంస్థ ద్వారా రైతులకు అందించేవారు. పాడిపరిశ్రమలోని రైతులు మరణిస్తే తక్షణ సహాయం కింద కొంత నగదు అందించేవారు. కానీ, కొన్ని నెలలుగా రైతులకు ఇవన్నీ సరఫరా చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారు.

ఏడాదిగా రాని నిర్వహణ ఖర్చులు..

సొసైటీల నిర్వహణ నిధులను ఏడాదిగా అందించడంలేదు. దీంతో రవాణా, కరెంటు బిల్లులు, కూలింగ్ తదితర ఖర్చులకు నిర్వాహకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కేంద్రాల్లో పాలసేకరణ చేసేందుకు నియమించిన రైతులకు ఇచ్చే గౌరవవేతనం 15 నెలలుగా రావడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన అమ్మకాలు..

ఫెడరేషన్ స్థాయిలో లక్ష లీటర్లకు పాల సేకరణ పెరిగినా.. తగిన విధంగా అమ్మకాలు జరగడంలేదు. ప్రైవేటు సంస్థలు ఆవుపాలను లీటర్‌కు రూ.34 నుంచి రూ.36 విక్రయిస్తుంటే విజయడెయిరీ రూ.44 నుంచి రూ.45లకు, గేదేపాలను లీటర్‌కు రూ.52 నుంచి రూ.55 విక్రయిస్తున్నది. దీంతో వినియోగదారులు తక్కువ ధరకు అందించే ప్రైవేటు సంస్థల పాలనే కొనుగోలు చేస్తుండడంతో విజయ పాల అమ్మకాలు గణనీయంగా తగ్గాయి. ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ రంగ సంస్థలు, దేవాదాయ శాఖకు విజయ పాలు, నెయ్యి ఉత్పత్తులను అందించాలని ఆదేశాలివ్వడం కొంత ఊరటను కలిగిస్తుంది. సిద్దిపేట, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 4,700 లీటర్ల పాలు ప్రభుత్వ రంగసంస్థకు అందుతున్నాయి. ఇప్పటినంచైనా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలని రైతులు కోరుతున్నారు.



68 ఏళ్ల సేవలకు ఇక సెలవు

- గ్రామపంచాయతీ నుంచి మున్సిపల్ వరకు సేవలందించిన భవనం
- నేడు మున్సిపల్ కార్యాలయ భవనం ప్రారంభం

7

చెడు వ్యసనాలకు బానిసై గంజాయి అమ్మకం

యాసంగి సాగుకు సమాయత్తం

- జిల్లాలో 3.86 లక్షల ఎకరాల్లో సాగు అంచనా
- అగ్రస్థానం వరిదే.. సిద్ధమతున్న నారు మడులు



సిద్దిపేట కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వానకాలం పంటల సీజన్ ముగిసి యాసంగి సీజన్ ప్రారంభమైంది. వరి కోతలు చివరి దశకు చేరాయి. కొన్ని చోట్ల ఆలస్యంగా నాట్లు పడగా, అక్కడ మాత్రమే ప్రస్తుతం కోతలు జరుగుతున్నాయి. వానకాలంలో జిల్లాలో రైతులు అధికంగా 3.68 లక్షల ఎకరాల్లో వరిని సాగు చేశారు. యాసంగిలోనూ వరి పంటలనే అధికంగా సాగు చేయనున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

3.51 లక్షల ఎకరాల్లో వరి సాగు...

మొదట్లో వర్షాలు అంతంత మాత్రమే కురిసినా.. పంటలు సాగు చేసిన అనంతరం భారీ వర్షాలు పడడంతో చెరువులు, కుంటలు నిండాయి. దీంతో భూగర్భ జలాలు సైతం పెరగడంతో బోర్లు, బావుల్లో నీరు పుష్కలంగా ఉన్నది. ఫలితంగా జిల్లాలో యాసంగి సాగునీటికి ఎలాంటి ఢోకా లేదు. యాసంగి సీజన్‌లో జిల్లాలో 3.86 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేసే అవకాశం ఉంది. వివిధ రకాల పంటల విస్తీర్ణాన్ని పరిశీలిస్తే వరి 3.51 లక్షల ఎకరాలు, వేరుశనగ 556, శనగ 420 , మక్కజొన్న 22,793, స్వీట్ కార్న్ 442, పత్తి 64, పొద్దుతిరుగుడు 9894, పెసర 62, మినుములు 22, కంది 42, ఇతర పంటలు 800 ఎకరాల్లో సాగు చేయనున్నారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు

యాసంగి సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలను ప్రభుత్వం రైతులకు అందుబాటులో ఉంచింది. అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జిల్లాలోని ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, ఎంపిక చేసిన ఎరువుల డీలర్ల వద్ద విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచింది. ఎరువులు, విత్తనాల కొనుగోలుతో దుకాణాలు రైతులతో కిటకిటలాడుతున్నాయి.

నారుమళ్లు సిద్ధం..

రైతులు యాసంగి పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. అత్యధికంగా వరి సాగు చేయనున్న రైలులు ఇప్పటికే నారుమళ్లను సిద్ధం చేస్తున్నారు. రైతులు యాసంగిల్లో విత్తనాలను మండెకట్టి మొలకలు రాగానే చల్లనున్నారు.



కంపెనీలో సీజ్ చేసిన మెడిసిన్

ఫార్మా కంపెనీలో తనిఖీలు

- కోటీ 33లక్షల విలువైన మందులు స్వాధీనం

మర్కుక్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలం కర్కపట్ల గ్రామంలోని ఓ ఫార్మా కంపెనీలో బుధవారం తనిఖీలు చేసి డ్రగ్ కంట్రోల్ అధికారులు ఒక కోటి 33లక్షల విలువైన యాంటీబయాటిక్స్ పలు రకాల శాంపిల్స్‌ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ యాంటీబయాటిక్ డ్రగ్స్‌ని రష్యాకు ఎగుమతి చేసేందుకు సిద్ధం చేస్తున్నట్లు డ్రగ్స్ అధికారులు తెలిపారు. కంపెనీ యాజమాన్యం దగ్గర సరైన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశారు. ఆయా కంపెనీల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా ఎగుమతి చేసినట్లు గుర్తించామని అన్నారు. ఈ సందర్భంగా కంపెనీ యాజమాన్యం మాట్లాడుతూ డ్రగ్ కంట్రోల్ వారికి యాంటీబయాటిక్ శాంపిల్స్ పంపించామని తెలిపారు.

పోక్సో కేసులో వృద్ధుడికి ఐదేళ్ల జైలు

రామచంద్రాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పోక్సో కేసులో వృద్ధుడికి ఐదేళ్ల జైలు, రూ.2 వేల జరిమానా విధిస్తూ సంగారెడ్డి అదనపు జడ్జి కే.జయంతి బుధవారం తీర్పు వెలువరించినట్టు రామచంద్రాపురం సీఐ జగన్నాథ్ తెలిపారు. బండలగూడకు చెందిన ఆచారి రాజు(60) కూలీగా పనిచేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన బాలిక(5)పై గతేడాది లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అప్పట్లో పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయగా.. ఎస్‌ఐ వెంకటేష్ దర్యాప్తు చేశారు. కేసులో ఆధారాలు సమర్పించిన ఎస్‌ఐని, కోర్టు కానిస్టేబుల్ కాశీని సీఐ అభినందించారు.

కార్తీక దీపాలు వెలిగించడం మహా పుణ్యఫలం

- రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామిజీ
- నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కార్తీక దీపోత్సవం



కార్తీక దీపోత్సవాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మాధవానంద స్వామిజీ

వర్గల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో కార్తీకదీపాలు వెలిగించడం ఎంతో పుణ్యఫలమని మెదక్ రంగంపేట పీఠాధిపతులు మాధవానంద సరస్వతీ స్వామిజీ అన్నారు. బుధవారం వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహ స్వామి క్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక దీపోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. కార్తీకమాసం శివుడికి ఎంతో ప్రాధాన్యతమైన మాసమన్నారు. ప్రతి నిత్యం దీపారాధన చేయడం వల్ల మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.అన్నపూర్ణ, ఆలయ అర్చకులు, అధికారులు సుధాకర్, పాండు, నరేందర్ పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల టీచర్లు, సిబ్బంది నిరసన

నర్సాపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీచర్లు, సిబ్బంది యూటీఎఫ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన సమయంలో నల్లబ్యాడ్జీలతో చిప్పల్‌తుర్తి పాఠశాల ప్రాంగణంలో బుధవారం నిరసన చేపట్టారు.

'భట్టి'ని కలిసిన పంచాయతీ కార్యదర్శులు



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కంది, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎంఎస్‌ఎస్.వాణి బుధవారం కలిశారు. ఉమ్మడి మెదక్ జిల్లా పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్ 1, 2 పదోన్నతులు కల్పించాలని ఆమె ఈ సందర్భంగా కోరారు. అలాగే పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి న్యాయం చేస్తానని హామీఇచ్చినట్టు వాణి తెలిపారు.

డీఆర్వోగా భుజంగరావు బాధ్యతల స్వీకరణ

మెదక్ అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా నూతన డీఆర్వోగా భుజంగరావు బాధ్యతలను స్వీకరించారు. నిర్మల్ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై మెదక్ జిల్లాకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డీఆర్వో పద్మశ్రీ ఐదునెలలుగా దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. కాగా భుజంగరావు కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. డీఆర్వోకు అదనపు కలెక్టర్ మెంచు నగేష్, మెదక్, నర్సాపూర్ ఆర్డీవోలు రమాదేవి, మహిపాల్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు చోట్ల ఉరేసుకుని ఇద్దరి మృతి

దౌల్తాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు చోట్ల ఇద్దరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దౌల్తాబాద్ మండల పరిధి సూరంపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన భీముగారి లచ్చయ్య, సువర్ణ దంపతులు. వీరికి ముగ్గురు కూతుళ్లు. లచ్చయ్యకు ఉన్న కొద్ది భూమి అమ్మి కూతుళ్ల వివాహం చేశాడు. రెండో కూతురు రజితకు హెచ్ఐవీ సోకడంతో భర్తతో విడాకులు తీసుకుని తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. లచ్చయ్యకు కుష్టు ఉండడంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో లచ్చయ్య, సువర్ణకు ప్రతిరోజూ గొడవ జరుగుతోంది. దీంతో మనస్తాపం చెందిన లచ్చయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

మరో ఘటనలో..

సూరంపల్లి గ్రామానికి చెందిన వడ్డే స్వామికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మహేందర్(20) గజ్వేల్‌లోని ఓ ఫైనాన్స్‌లో పనిచేస్తున్నాడు. ఇటీవలే మహేందర్ వాళ్ల మేనమామ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడడంతో కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లారు. కాగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహేందర్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉన్నది.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


మహేష్ మృతదేహం

జిన్నారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందాడు. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం కొడకంచి గ్రామానికి చెందిన కంచనపల్లి మహేష్(30) మంగళవారం రాత్రి 9 గంటలకు ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద ఆరాతీసినా ఆచూకీ లభించలేదు. కాగా బుధవారం తెల్లవారుజామున గ్రామ శివారులోని ప్రధాన రహదారి పక్కన మహేష్ శవమై కనిపించడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. మహేష్ మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ కుటుంబీకులు జిన్నారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కూతురును చంపిన వ్యక్తికి జీవిత ఖైదు

టేక్మాల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కూతురును కిరాతకంగా చంపిన వ్యక్తికి జీవిత ఖైదుతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ మెదక్ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పీ.లక్ష్మీశారద మంగళవారం తీర్పునిచ్చారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం పల్వంచ గ్రామానికి చెందిన బుర్ల రమణయ్య 2021లో కూతురు శివాని(3) గొంతు నులిమి హత్యచేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన అప్పటి సీఐ జార్జ్ విచారణ చేసి కోర్టుకు ఆధారాలు సమర్పించారు. నిందితుడు రెండో వివాహం చేసుకోగా.. అప్పటికే ఆమెకు కూతురు ఉన్నది. తనకు పుట్టలేదనే అనుమానంతో హతమార్చాడు. భార్య గర్భవతిగా ఉండడంతో తనకు పుట్టబోయే బిడ్డ తన వారసత్వానికి ఇబ్బంది కలుగుతుందని హత్య చేసినట్లు సాక్ష్యాధారాలు పరిశీలించిన కోర్టు నిందితుడు ఉద్దేశపూర్వకంగా హత్య చేసినట్లు ధ్రువీకరించి జీవిత ఖైదు విధించింది.


కోహీర్‌లో సాగుచేస్తున్న జామ పంట



కోరి మరీ కొంటారు.. కోహీర్ జాంపండు..

● రుచిలో 'కోహినూర్' ● పేరుగాంచిన 'సఫేదా' రకం ● 350 ఎకరాల్లో తోటల సాగు

కోహీర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కోహీర్ అనగానే ముందుగా గుర్తుకొచ్చేది తియ్యని సఫేదా రకం జామ పండు. కోహినూరు వజ్రానికి ఎంత పేరుందో... కోహీర్ జామ పండుకు అంతే పేరుందని చెబుతారు. కోహీర్ సఫేద జామ అంటే తెలియనివారు ఉండరు. కోహీర్ జామకు.. కోహీర్‌కు రెండు శతాబ్దాల అనుబంధం ఉంది. మండలంలో దాదాపు 350 ఎకరాల్లో సాగవుతోంది. దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన సఫేదా రకం జామ అలహాబాద్ సఫేదా, కోహీర్ సఫేదా రెండు రకాల్లోనే దొరుకుతుంది. ఇలాంటి జామ తోటలు కోహీర్‌లో ఉండడం గమనార్హం. ఈ జామపండు తెలుపు రంగులో మెరిసిపోతుంది. గింజలు తక్కువ.. గుజ్జు ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతంలోని వారు ఎక్కడికి వెళ్లినా జామ మొక్కనే బహుమతిగా ఇస్తారు. లేదా పండ్లను తీసుకెళ్లి అందజేయడం ఆనవాయితీ అని ఈ ప్రాంతం వారు చెబుతున్నారు.

ప్రత్యేక గుర్తింపు

సఫేదా జామపండు సాగువల్ల కోహీర్‌కు జాతీయ స్థాయిలో పేరొచ్చింది. దేశంలో సఫేదా రకం జామలో అలహాబాద్ సఫేదా, కోహీర్ సఫేదా మాత్రమే ప్రత్యేకం. అయితే కోహీర్‌లో జామ సాగు ఎప్పుడు ప్రారంభమైంది. ఎక్కడి నుంచి వచ్చిందనే ప్రశ్నలకు సమాధానం లేదు. ఈ ప్రాంతంలోని నేలలు ఇసుకతో కూడిన ఎర్రమట్టితో ఉండడం జామపంట సాగుకు అనువైంది. ఇతర నెలల్లో కంటే ఎర్రనేలల్లో పండిన జామపండ్లు రుచికరంగా ఉంటాయి. తెలుపు వర్ణంలో ఉంటూ పండుపై అక్కడక్కడ ఎర్రని మచ్చలు ఉంటాయి.

లాల్ బహదూర్ శాస్త్రికి బహుమతిగా జామ మొక్క

50వ దశకంలో మొదటి రైల్వేశాఖ మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి కోహీర్ మీదుగా రైలులో వెళ్తుండగా.. స్వాతంత్ర్య సమరయోధులు ఆయనను కలుసుకునేందుకు వెళ్లి కోహీర్ జామ మొక్కను బహుమతిగా ఇచ్చారు. చౌకగా లభించే జామకాయ లేదా పండులో పోషకాలు చాలానే ఉంటాయి. ముఖ్యంగా దీనిలో క్యాలరీలు తక్కువగా ఉండి పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. నీటిలో కరిగే బీ, సీ విటమిన్లు, కొవ్వులో కరిగే విటమిన్ ఏ జామకాయలో ముఖ్యంగా లభించే పోషకాలు. ఇక జామపండుపై చర్మంలో విటమిన్ సీ అత్యధికంగా ఉంటుంది.

జామతో లాభాలు

జామ పండులో ఉండే పీచు పదార్థం వల్ల మలబద్ధకం నివారించబడుతుంది. పీచు పదార్థం వల్ల డయాబెటిస్ రోగులకు సంజీవనిలా ఉపయోగపడుతుంది. బొప్పాయి, ఆపిల్, నేరేడుపండు కంటే జామపండులోనే పీచు పదార్థం ఎక్కువగా ఉండడంతో షుగర్ వ్యాధికి చక్కటి ఔషధమని చెబుతారు. జామ ఆకులను నమలడం వల్ల పంటి నొప్పులు తగ్గడమే కాక.. ఆకలి కూడా పెరుగుతుంది. పైగా కొన్నిరకాల వ్యాధుల బారినపడి ఆకలి మందగించిపోయిన వారికి ఇది ఆకలి పుట్టించగలదు. జామపండు కంటే జామకాయను తినడం శ్రేష్ఠం. కాయ గట్టిగా, ఆకుపచ్చ రంగులో, దోరగా ఉన్నప్పుడే తినేస్తే దాని పూర్తి గుణం శరీరానికి అందుతుంది. పేదల యాపిల్ జామలో అధిక పోషకాలు, ఔషధ గుణాలు ఉంటాయి.

జామ సాగుపై ఆసక్తి

కోహీర్, బిలాల్‌పూర్, దిగ్వాల్, ఖానాపూర్, గుర్జువాడ, మాచిరెడ్డిపల్లి, నాగిరెడ్డిపల్లి, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో గతంలో వేలాది ఎకరాల్లో జామ సాగయ్యేది. అయితే 20 ఏళ్ల క్రితం పండ్లకు కుళ్లు, తెగుళ్లు సోకడంతో జామ రైతులు విపరీతంగా నష్టపోయారు. దీంతో వందలాది ఎకరాల్లో జామ తోటలు రైతులు నరికివేశారు. ప్రస్తుతం పరిస్థితిలో మార్పు వచ్చింది. రైతులు మళ్లీ జామపంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం మండలంలో 350 ఎకరాల్లో సాగవుతోంది. సుమారు 200 కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి పొందుతున్నాయి.

మార్కెట్ సదుపాయం కరువు

జామచెట్లు ఏడాదికి రెండుసార్లు కాత కాస్తాయి, మే, జూన్‌లో ఒక్కసారి... నవంబరు, డిసెంబరు, జనవరిలో పండ్లు కోతకు వస్తాయి. ప్రధానంగా నవంబరు, డిసెంబరు, జనవరిలోనే కాత అధికంగా ఉంటుంది. ఇక్కడి పండ్లను హైదరాబాద్‌తో పాటు తాండూరు, కర్నాటకలోని బీదర్, గుల్బర్గా తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. స్థానిక అమ్మకాలు తోడు రోజూ సుమారు మూడు టన్నుల జామపండ్లను ఎగుమతి చేస్తున్నారు. స్థానికంగా మార్కెట్ లేకపోవడంతో పాటు రవాణా సౌకర్యం లేక రైతులు వ్యాపారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.


కవేలి చౌరస్తా 65వ జాతీయ రహదారి పక్కన జామపండ్ల విక్రయం

మళ్లీ రంగంలోకి హైడ్రా..!

● ఫిర్యాదుల నేపథ్యంలో చెరువుల పరిశీలన
● ఆక్రమణలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చిన స్థానికులు
● షెడ్ల తొలగింపునకు రంగనాథ్ ఆదేశం

హైదరాబాద్ సిటీ/రామచంద్రాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా మరోసారి రంగంలోకి దిగింది. గ్రేటర్‌తోపాటు శివారు ప్రాంతాల్లోని పలు చెరువులను కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. నివాసేతర ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని, వెంటనే తొలగించాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి మాదాపూర్‌లోని ఖానామెట్ సర్వే నెంబర్ 7లో 6.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈదులకుంటను ఓ రియల్ ఎస్టేట్ సంస్థ మట్టితో పూడుస్తుందన్న ఫిర్యాదుతో అక్కడకు వెళ్లిన రంగనాథ్.. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరోసారి ఈదులకుంటను పరిశీలిస్తానని, నిర్మాణదారుల వద్ద ఉన్న డాక్యుమెంట్లు, సర్వే నివేదికను పరిశీలిస్తానన్నారు. మాదాపూర్‌లోని మేడికుంటను కూడా ఆయన పరిశీలించారు. మెజార్టీ కుంట మాయమై ఇప్పటికే అక్కడ బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి.

చెరువులు కబ్జా కాకుండా నియంత్రిస్తాం

నిజాంపేటలోని తలాబ్ (తురక లేక్) చెరువు ఆక్రమణల వివరాలను స్థానికులు కమిషనర్ రంగనాథ్‌కు వివరించారు. చెరువుకు సంబంధించిన మ్యాపులు, డాక్యుమెంట్లను ఆయన పరిశీలించారు. ఇదే చెరువు వద్ద నిజాంత ల్యాబ్‌ను కూడా పరిశీలించారు. కట్టకు ఆనుకుని ఉన్న షెడ్లను రెండు రోజుల్లో తొలగించాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కట్టపైకి వెళ్లిన కమిషనర్ చెరువులోకి ఇన్‌లెట్ ద్వారా వస్తోన్న మురుగునీటిని చూసి చెరువంతా కలుషితమవుతుందని, మళ్లింపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్, రెవిన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో చెరువుకు సంబంధించి సమగ్ర సర్వే చేయాలన్నారు. బండారి లే అవుట్ కమ్యూనిటీ అసోసియేషన్ సభ్యుల కోరిక మేరకు చెరువును పూర్తిస్థాయిలో పరిశీలించారు. నార్సింగ్‌లోని నెక్నాంపూర్ చిన్న చెరువును పరిశీలించిన ఆయన బఫర్ జోన్‌లో నిర్మాణాల వివరాలు తెలుసుకున్నారు. గేటెడ్ కమ్యూనిటీలోని మురుగు నీరు నేరుగా వచ్చి చెరువులో చేరుతుందని స్థానికులు ఫిర్యాదు చేశారు. తెల్లాపూర్‌లోని వనం, చెల్లికుంట, మేళ్ల చెరువులను ఆయన పరిశీలించారు. సుందరీకరణ పేరిట రియల్ కంపెనీలు కబ్జా చేస్తున్నాయని, చెరువులను పునరుద్ధరించాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. ఇక నుంచి చెరువులు కబ్జా కాకుండా నియంత్రిస్తామని, పునరుద్ధరణకూ అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రికార్డులు, క్షేత్రస్థాయిలో పరిస్థితులు, డాక్యుమెంట్లు, సర్వే నివేదికలను పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలుంటాయని స్థానికులతో కమిషనర్ పేర్కొన్నారు.

చెరువుల సమగ్ర విచారణకు త్వరలో వస్తా

సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలంలోని తెల్లాపూర్ మేళ్లచెరువును కూడా హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. మేళ్ల చెరువు కట్టపై నుంచి ఏలియన్స్ నెవీ గార్డెన్, సంకల్ప, ఇండస్‌క్రెస్ట్, ఎన్‌సీసీ క్లబ్ హౌస్‌లు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నాయని అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కొల్లూరు పెద్ద చెరువులోకి వెళ్లే వరద కాలువను ఓ బిల్డర్ పూడ్చి వేశారన్నారు. కొల్లూరు నుంచి మేళ్ల చెరువులోకి వచ్చే వరద కాలువను 177 సర్వేనంబరులో పూడ్చి వేసి పట్టాదారు తన భూమిలో కలుపుకున్నారని, ఈ వరద కాలువ కోసం ప్రభుత్వం 1.6 ఎకరాల భూమిని విడిచిపెట్టిందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ చెరువుల సమగ్ర విచారణకు త్వరలో మళ్లీ వస్తానని, అధికారులు అన్ని రికార్డులతో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. చెరువులను కబ్జా చేశారని నిర్ధారణ అయితే ఎవరిని విడిచిపెట్టేది లేదన్నారు.

వీడిన తల్లీకొడుకుల ఆత్మహత్య మిస్టరీ

● దొంగతనాలు బయటపడ్డాయని మనస్తాపంతో..


వడ్ల శ్యామ్(ఫైల్), బాలమణి(ఫైల్)

జోగిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించిన తల్లీ కొడుకుల ఆత్మహత్య మిస్టరీ వీడింది. అందోలు మండలం చింతకుంటకు చెందిన వడ్ల శ్యామ్ తొలుత చేసిన దొంగతనం నుంచి బయటపడేందుకు మరో దొంగతనం చేశాడు. తీరా పట్టుబడ్డాక తట్టుకోలేక ఆత్మహత్య చేసుకునేందుకు మంగళవారం రాత్రి గ్రామ సమీపంలోని మంజీరా నదిలోకి దూకాడు. తల్లి బాలమణి కూడా వెంటనే దూకింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన శ్యామ్ ఇంటి వెనుక ఉన్న చాంద్‌పాషా ఇంటికి బంధువులు ఐదురోజుల క్రితం టాటా ఏస్‌లో వచ్చి రాత్రి అక్కడే బసచేశారు. అయితే శ్యామ్ సదరు టాటా ఏస్‌ను అదేరాత్రి దొంగిలించి.. నర్సాపూర్ వైపు వెళ్తుండగా.. కొల్చారం మండలం బుజరంపేట వద్ద పాడై ఆగిపోయింది. అనంతరం దానిని తీసే క్రమంలో విపరీతమైన శబ్దం రావడంతో గ్రామస్థులు లేచి దొంగ, దొంగ అని అరిచారు. దీంతో భయపడ్డ శ్యామ్.. అక్కడే పార్క్ చేసి ఉన్న బైక్‌ను దొంగిలించి చింతకుంటకు పారిపోయాడు. దుంపలకుంట వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరా ఫుటేజీల్లో శ్యామ్‌ను గుర్తించడంతో బుజరంపేట గ్రామస్థులు చింతకుంటకు వచ్చారు. తమ బైక్‌ను ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశారు. ఇదే క్రమంలో చాంద్‌పాషా కూడా తమ బంధువుల టాటాఏస్‌ను ఇవ్వాలన్నాడు. ఈ విషయమై బుజరంపేట గ్రామస్థులు శ్యామ్‌ను, అతడి తల్లిదండ్రిని బుజరంపేటకు పంచాయితీకి పిలిచారు. శ్యామ్(27), తల్లి బాలమణి(48)తో కలిసి బైక్‌పై, తండ్రి యాదయ్య బస్సులో బయలుదేరాడు. సమీపంలోని మంజీరా నదిపై గల బ్రిడ్జి వద్దకు రాగానే శ్యామ్ బైక్‌ను ఆపాడు. తల్లి బాలమణిని దింపి ఒక్కసారిగా నదిలోకి దూకాడు. ఆ వెంటనే తల్లి కూడా దూకింది. అటుగా వెళ్తున్న ఇతర వాహనదారులు చూసి వాట్సాప్‌లో సదరు బైక్ ఫొటో పెట్టారు. మృతుడి తండ్రి యాదయ్య విషయం తెలుసుకుని పోలీసులకు, బంధువులకు సమాచారమందించాడు. రాత్రి కావడంతో గాలింపు సాధ్యం కాలేదు. దీంతో బుధవారం ఉదయం పోలీసులు గాలింపు చేపట్టి ఇద్దరి మృతదేహాలను బయటకుతీశారు. పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లందరూ క్రమశిక్షణతో ఉండాలి: రమేష్

సంగారెడ్డి క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్‌జెండర్లందరూ క్రమశిక్షణతో ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ సూచించారు. సంగారెడ్డిలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో బుధవారం ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయవ్యవస్థలో ఎలా ఉండాలో చెప్పారు. వారికున్న హక్కుల గురించి వివరించారు. లింగ మార్పిడి వ్యక్తి సంరక్షణ, న్యాయపరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు.


మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్

చెడు వ్యసనాలకు బానిసై గంజాయి అమ్మకం

● పదికిలోల గంజాయి, ఫోన్లు స్వాధీనం, ఇద్దరు నిందితుల అరెస్ట్


గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసై గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని గజ్వేల్, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ పురుషోత్తంరెడ్డి వివరాలను వెల్లడించారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన అరికెల శేఖర్(23), అదే గ్రామానికి చెందిన బోయిన నరేశ్(23) మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మల్లబోయినపల్లి గ్రామానికి చెందిన సుక్కసారి భానుప్రసాద్(21) ప్రస్తుతం సిద్దిపేట జిల్లా కొండపాక మండలం సిరిసినగండ్లలో నివాసముంటున్నాడు. వీరు ముగ్గురు చెడు అలవాట్లకు బానిసై, ఈజీ మనీ కోసం గంజాయిని వ్యాపారంగా చేసుకున్నారు. ఈ క్రమంలో భద్రాచలం జిల్లా సీలేరుకు చెందిన వర్ధన్ వద్ద గంజాయిని కొనుగోలు చేస్తూ వ్యాపారాన్ని చేస్తున్నారు. వారంరోజుల క్రితం శేఖర్, నరేశ్ గంజాయి తీసుకురావడానికి వెళ్తున్నామని చెప్పి భానుప్రసాద్‌కు ఫోన్‌చేయగా తాను రానని, గంజాయి కావాలని రూ.7 వేలు శేఖర్‌కు ఫోన్‌పే చేశాడు. నరేశ్ స్నేహితుడు చింటు బైక్‌పై అరికెల శేఖర్, బోయిని నరేశ్ ఇద్దరూ సీలేరుకు వెళ్లి వర్ధన్‌కు రూ.38 వేలు ఇచ్చి 20 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. బైక్‌పై వస్తే పోలీసులు పట్టుకుంటారని బ్యాగులో పెట్టుకుని హైదరాబాద్ వరకు బస్సులో వచ్చి అక్కడి నుంచి అహ్మదీపూర్‌కు చేరుకుని గ్రామ శివారులోని మల్లన్నసాగర్ కట్ట వద్ద దాచిపెట్టారు. గంజాయి కావాలని భానుప్రసాద్ అడగ్గా.. అందులోంచి శేఖర్ రెండు కిలోలు తీసి ఇచ్చాడు. ఈ క్రమంలో పోలీసులు చాకచక్యంగా వారిని పట్టుకుని విచారణ చేపట్టారు. వారి నుంచి పది కిలోల గంజాయిని, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. బోయిన నరేశ్, వర్ధన్ పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. కాగా ఈ ముగ్గురిపై గతంలో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదవగా, సదరు కేసులో బెయిల్‌పై విడుదలై వచ్చారని ఏసీపీ తెలిపారు. చాకచక్యంగా గంజాయిని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవీందర్, ఇన్‌స్పెక్టర్లు జానకీరాంరెడ్డి, గజ్వేల్ సీఐ సైదా, ముత్యంరాజు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ డాక్టర్ బీ.అనురాధ అభినందించారు. త్వరలోనే రివార్డును అందజేస్తామని తెలిపారు.

68 ఏళ్ల సేవలకు ఇక సెలవు

● గ్రామపంచాయతీ నుంచి మున్సిపల్ వరకు సేవలందించిన భవనం ● నేడు మున్సిపల్ కార్యాలయ భవనం ప్రారంభం


నూతన మున్సిపల్ కార్యాలయ భవనం

హుస్నాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ ఆటుపోట్లకు, అభివృద్ధికి ప్రణాళికలు చేసిన భవనం.. ఇక్కడ ప్రథమ పౌరునిగా పనిచేసిన నేతలను ఉన్నత పదవులు అందించిన పంచాయతీ కార్యాలయం.. నాటి గ్రామపంచాయతీ నేటి పురపాలక సంఘం వరకు 68 ఏళ్లు సేవలందించి ఇక సెలవంటుంది. గురువారం హుస్నాబాద్ మున్సిపల్ అన్ని హంగులతో నిర్మించిన నూతన కార్యాలయం ప్రారంభం అవుతున్న సందర్భంగా పాత కార్యాలయ భవనం చరిత్రగా మిలిగిపోనుంది.

1951లో హుస్నాబాద్ మైనర్ గ్రామపంచాయతీ. 3 వేల ఓటర్లు కూడా లేని గ్రామం. అంచలంచెలుగా మేజర్ గ్రామపంచాయతీగా ఎదిగింది. అపై పట్టణ రూపురేఖలు సంతరించుకొని 8 సెప్టెంబరు 2011లో నగరపంచాయతీగా మారింది. 24 మార్చి 2018న మున్సిపల్‌గా అప్‌గ్రేడ్ అయ్యింది. 1951లో మొదటి సర్పంచ్‌గా మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావు వియ్యంకుడైన బొప్పరాజు లక్ష్మీకాంతారావు ఎన్నికయ్యారు. మొదటి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఇంట్లోనే నిర్వహించారు. 1956లో హుస్నాబాద్ పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో గ్రామపంచాయతీ కార్యాలయంగా పెంకుటింటిని నిర్మాణం చేశారు. అప్పటి నుంచి పట్టణ అభివృద్ధికి అనుగుణంగా ఇంటిని కూల్చివేసి దీని స్థానంలో భవనం నిర్మించారు. ఇందులో సర్పంచ్‌గా పనిచేసిన నేతలకు రాజకీయ భవిష్యత్తు అందించింది. సర్పంచ్‌గా పనిచేసిన లక్ష్మీకాంతారావు హుస్నాబాద్ బ్లాక్ ప్రెసిడెంట్‌గా, 1962లో ఇందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు ఇక్కడ సర్పంచులు, వార్డు సభ్యులుగా పనిచేసిన పలువురు నాయకులు ఉన్నత పదవులు పొందారు. నాటి గ్రామపంచాయతీ నుంచి నేటి మున్సిపల్ కార్యాలయం వరకు 68 ఏళ్లు సేవలందించిన ఈ భవనం హుస్నాబాద్ పట్టణానికి చరిత్రగా నిలువబోతుంది.


నగర పంచాయతీ కార్యాలయ భవనం(ఫైల్)

రూ. 5 కోట్లతో మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం

హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన మున్సిపల్ కార్యాలయ నూతన భవనాన్ని గురువారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు. 10 ఏళ్ల క్రితం అప్పటి నగర పంచాయతీ కార్యాలయ నిర్మాణం కోసం రూ.50 లక్షల మంజూరైనా స్థల సేకరణ, నిధుల లేమి వంటి పలు సమస్యలతో పనులు జరుగలేదు. అనంతరం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మాణాన్ని చేపట్టారు. తదుపరి రూ. 2.50 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టగా గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్‌లలో అధునాతనంగా నిర్మించడంతో దీని వ్యయం రూ.5 కోట్లకు చేరింది. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న దీని నిర్మాణానికి ఆహర్నిశలు కృషి చేయడం వల్లనే ప్రస్తుతం ప్రారంభానికి నోచుకుంటుందని పలువురు ఆమెను అభినందిస్తున్నారు.

తాడిచెట్ల తొలగింపుపై కేసు

చేర్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం కిష్టంపేటలో సుమారు 10 తాటిచెట్లను తొలగించిన ఇరువురిపై కేసు నమోదుచేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ సురేశ్ తెలిపారు. గ్రామశివారులోని వ్యవసాయ భూమిలో ఉన్న తాటిచెట్లను కొత్తపల్లి రవీందర్‌రెడ్డి, కొత్తపల్లి దశమంత రెడ్డి తొలగించడంతో గ్రామానికి చెందిన గౌడసంఘం ప్రతినిధులు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ సురేశ్ ఘటనాస్థలానికి చేరుకున్నారు. తాటిచెట్ల తొలగింపుపై మందలించి పంచనామా చేసి ఇరువురిపై కేసు నమోదు చేశారు.

లారీ బోల్తా.. బాలుడికి గాయాలు

గజ్వేల్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఇటుకల లారీ మండల పరిధిలోని కొడకండ్ల గ్రామం వద్దకు రాగానే లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో డివైడర్‌కు ఢీకొని బోల్తా పడింది. లారీలో ఉన్న ఇటుకలు విద్యార్థికి తగిలి స్వల్ప గాయాలయ్యాయి.

కాలువ ఎత్తు పెంచారు.. రోడ్డు వేయడం మరిచారు

● రెండేళ్లుగా పూర్తికాని అప్రోచ్ రోడ్డు ● ధ్వంసమవుతున్న ఆర్‌అండ్‌బీ కొత్త రోడ్డు ● దుబ్బాక-ముస్తాబాద్ రహదారిలో ప్రమాదాలు


దుబ్బాక-ముస్తాబాద్ రోడ్డుకు ఎత్తుగా కంకరతేలిన మల్లన్నసాగర్ కాలువ బ్రిడ్జి

దుబ్బాక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖ అధికారుల తీరుతో దుబ్బాక- ముస్తాబాద్ ఆర్అండ్‌బీ రహదారి ప్రమాదకరంగా మారింది. మూడేళ్లుగా కాలువబ్రిడ్జి నిర్మాణం నత్తనడకన సాగదీసి, తీరా అప్రోచ్ రోడ్డును మరవడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారికి అడ్డంగా లెక్కకు మించి మల్లన్నసాగర్ 4 లెవల్ కాలువ ఎత్తును పెంచిన నీటిపారుదలశాఖ అధికారులు, సమాంతరంగా రహదారి అప్రోచ్‌ను పూర్తి చేయాల్సి ఉంటుంది. కొండంత ఎత్తు పెంచడంతో వాహనాలు ఆ ఎత్తును ఎక్కలేక అవస్థలు పడుతున్నాయి. అంతేగాక పెంచిన ఎత్తుకు సమాంతరంగా రహదారి అప్రోచ్‌ను కూడా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆ పాటికే ఆర్‌అండ్‌బీశాఖ దుబ్బాక, ముస్తాబాద్ రహదారిని రూ. 12 కోట్లతో ఇటీవలనే పూర్తి చేశారు. మూడేళ్లుగా బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు బ్రిడ్జికి సమీపం వరకు ఇరువైపుల తారురోడ్డు పూర్తి చేశారు. బ్రిడ్జి సమీపంలో తేలిన కంకర ఆర్‌అండ్‌బీ కొత్తరహదారిపైకి వెళ్లి, గుంతలు పడేలా మారింది. ఆర్‌అండ్‌బీ రహదారికి, బ్రిడ్జికి నడుమ ఎత్తు తాటి చెట్టు ఎత్తుగా మారడంతో వాహనాలు బ్రిడ్జి ఎక్కడం కష్టతరంగా మారింది. అంతేగాక బ్రిడ్జి ముందు భాగం రహదారి పూర్తిగా గుంతలమయంగా మారడంతో గుంతల్లోనే వాహనాలు ఆగిపోతున్నాయి. వీటికి తోడు కంకర తేలడంతో ఇటీవల ఆ తేలిన కంకరతో ఆటోవాహనం కూడా బోల్తాపడింది.

త్వరలో మార్క్‌ఫెడ్ ద్వారా ఆయిల్‌పామ్ కొనుగోళ్లు

● జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ

రాయపోల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలోనే ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో మార్కెటింగ్ సదుపాయం ఏర్పాటవుతుందని, 2025 జూన్ నాటికి సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలో ఫ్యాక్టరీ అందుబాటులోకి వస్తుందని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సువర్ణ పేర్కొన్నారు. మండలంలోని అంకిరెడ్డిపల్లిలో ఆయిల్‌పామ్ పంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గెలలు ఫ్యాక్టరీకి సరఫరా చేసిన మూడు రోజుల్లో నగదు రైతుల ఖాతాల్లో జమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి రమేష్, ఫీల్డ్ ఆఫీసర్ అంజనేయులు, ఏఈఓ మధులిక, రైతులు పాల్గొన్నారు.

● గజ్వేల్: ఆయిల్‌పామ్ సాగుకు రైతులు మొగ్గు చూపాలని సిద్దిపేట జిల్లా ఆయిల్‌పామ్ అధికారి నాగరాజు, గజ్వేల్ మండల వ్యవసాయాధికారి గుండు నాగరాజు కోరారు. గజ్వేల్ మండల పరిధిలోని బెజుగామలో ఉద్యానవనశాఖ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగు ద్వారా ఆదాయం గణనీయంగా పెరుగుతుందన్నారు. మిగతా రకాల పంటలతో పోల్చితే ఆయిల్‌పామ్ సాగు చేసిన రైతులు అనేక ప్రయోజనాలు పొందుతారన్నారు. ఉద్యానవనశాఖ ద్వారా డ్రిప్, మొక్కలు సబ్సీడీలో లభిస్తాయని, మొదటి నాలుగు సంవత్సరాలు యాజమాన్యానికి రాయితీ వస్తుందన్నారు. ఆయనవెంట ఏఈవో మాధవి, ఉద్యానవనశాఖ అధికారి సౌమ్య, ఆయిల్ కంపెనీ ప్రతినిధులు, రైతులు శివరాం రెడ్డి, నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సత్యనారాయణ, నాంపల్లి బాబు తదితరులున్నారు.


గజ్వేల్: రైతులతో మాట్లాడుతున్న అధికారులు

● దౌల్తాబాద్: మొక్కజొన్న విత్తనం నాటిన నుంచి వారం రోజులలోపు వేప నూనే పిచికారీ చేస్తే కత్తెర పురుగు రాకుండా ఉంటుందని మండల వ్యవసాయాధికారి సాయికిరణ్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని ముబారస్‌పూర్‌లో బుధవారం మొక్కజొన్న, వివిధ రకాల పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు.

'కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి'

జగదేవ్‌పూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మరాటి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. కంప్యూటర్ ఆపరేటర్లను బుధవారం సీఐటీయూలోకి ఆహ్వానించి సభ్యత్వం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంప్యూటర్ ఆపరేటర్లకు జీపీల నుంచి రొటేషన్ పద్ధతిలో జీతాలు చెల్లిస్తున్నారని, అలా కాకుండా ట్రెజరీ నుంచి నేరుగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళలకు మెటర్నిటీ లీవులు మంజూరు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ గజ్వేల్ డివిజన్ నాయకులు పొట్కోల్ల దాసు, కంప్యూటర్ ఆపరేటర్లు లక్ష్మి, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేస్తే సత్ఫలితాలు వస్తాయి

● ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి

మర్కుక్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేస్తే సత్ఫలితాలు వస్తాయని ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి అన్నారు. మండలంలోని అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తున్న సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఓంకార్, రాధాకృష్ణ, రామకృష్ణారెడ్డి, రాములుగౌడ్, ఎంఈవోలు వెంకట్ రాములు, ఉదయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నరేందర్, ప్రధానోపాధ్యాయుడు, బాలకిషన్, ఉపాధ్యాయులు సంతోషిమాత, హారిక, సుస్రత్, చిన్నికృష్ణ ఉన్నారు.

హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ


వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం సభ్యులు

హుస్నాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో బుధవారం నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టింది. చైర్మన్‌గా కంది తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్‌గా బంక చందు, డైరెక్టర్లుగా బోడిగ పరుశురాములు, పత్తిపాక త్రిమూర్తి, ఓరుగంటి భారతీదేవి, పోతుగంటి బాలయ్య, మహ్మద్ కుతుబుద్దీన్, బొంగోని శ్రీనివాస్, లావుడ్య బిక్యా, మడప యాదవరెడ్డి, కరొంటుతు రవి, బైకని శ్రీనివాస్, తేరాల మారుతి, తనుకు అంజనేయులు బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మార్కెట్ కార్యదర్శి ప్రభాకర్ ఉన్నారు.

హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వం

● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్

చిన్నకోడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్ ఆరోపించారు. చిన్నకోడూరులో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ కాలయాపన చేస్తున్నదని, ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, నెరవేర్చిన హామీలను చెప్పాలని డిమాండ్ చేశారు. ఈనెల 29న సిద్దిపేట శివారులోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించే దీక్ష దివాస్ కార్యక్రమానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ దీక్షను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, మాజీ ప్రజాప్రతినిధులు శ్రీనివాస్, ఎల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, భూమిరెడ్డి, కనకయ్య, రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి ఎమ్మెల్యే హరీశ్‌రావు విరాళం


సిద్దిపేట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట రూరల్ మండలం రాంపూర్‌లో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి ఎమ్మెల్యే హరీశ్‌రావు లక్ష రూపాయలు విరాళం ఇచ్చారు. మిగులు పనుల కోసం అదనంగ మరో లక్ష అవసరం ఉన్నాయని గ్రామస్థులు హరీశ్‌రావు దృష్టికి తీసుకరాగ లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. మాజీ ఎంపీపీ శ్రీదేవి చందర్‌రావు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ప్రభాకర్ వర్మ, రైతు బంధు మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు యాదయ్య బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌లతో ఈ విరాళాన్ని గ్రామస్థుకు అందజేశారు.

భూ కబ్జాపై నిజాయితీ నిరూపించుకో

● మాజీమంత్రి హరీశ్‌రావుకు సవాల్

పంజాగుట్ట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఒక్క గుంట కూడా భూమిని కబ్జా చేయలేదని చెబుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు తన భూములపై విచారణ జరపాలని సీబీడీ, ఇతర దర్యాప్తు సంస్థలకు లేఖ రాసి తన నిజాయితీని నిరూపించుకోవాలని సిద్దిపేట జిల్లాకు చెందిన న్యాయవాది, చెర్ల అంకిరెడ్డి గ్రామం మాజీ ఉప సర్పంచ్ జెల్ల రవీందర్ యాదవ్, న్యాయవాది కుంచం అశోక్ యాదవ్, రమేష్ పోతరాజులు డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సిద్దిపేటలో హరీశ్‌రావు రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారని, ఆయన రాజ్యాంగం ఇప్పటికీ కొనసాగుతూనే ఉందని ఆరోపించారు. సిద్దిపేటలో అభివృద్ధిలో దూసుకుపోతుందన్న వార్తల్లో నిజం లేదన్నారు. రంగనాయక సాగర్ రిజర్వాయర్ నిర్మాణం సందర్భంగా ఇరిగేషన్‌శాఖ అధికారులతో స్థానిక రైతులను భయభ్రాంతులకు గురిచేసి వారి వద్ద నుంచి ఎకరాల కొద్ది భూమిని కొనుగోలు చేశారని ఆరోపించారు. నేరుగా రంగనాయక సాగర్ కోసం సేకరించిన భూమి నుంచి 9 గుంటల భూమిని అక్రమంగా తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. తాను ఒక్క గుంట భూమిని కూడా కబ్జా చేసుకోలేదని చెబుతున్న హరీశ్‌రావు కు సీబీడీ విచారణ కోరాలని సవాల్ విసిరారు. సిద్దిపేట అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (సుడా) పేరిట అక్రమాలు ఎన్నో ఉన్నాయని ప్రస్తుత ప్రభుత్వం వాటిని సమగ్రంగా విచారణ జరిపి వెలికి తీయాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రంగనాయక్ సాగర్ వద్ద భూ ఆక్రమణలకు పాల్పడినట్టు తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు.

మండల పరిషత్ కార్యాలయ ఏర్పాటుకు జీవో


టపాసులు పేల్చుతున్న కాంగ్రెస్ నాయకులు

దూళిమిట్ట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దూళిమిట్ట మండలంలో మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంతో బుధవారం కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు టపాసులు పేల్చి సంబురాలు చేసుకున్నారు.

నేడు చేర్యాలలో బీజేపీ పోరుదీక్ష

చేర్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో నేడు అంగడిబజారు చౌరస్తాలో పోరుదీక్ష చేపడుతున్నట్లు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బూరుగు సురేశ్ తెలిపారు. చేర్యాలలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేర్యాల ప్రాంత ప్రజలను కాంగ్రెస్ నేతలు మోసపుచ్చేందుకు ప్రయత్నిస్తుండటం తగదన్నారు. ఆయనవెంట నాయకులు దండ్యాల లక్ష్మారెడ్డి, నర్ర మహేందర్‌రెడ్డి, కాటం సురేందర్, కర్క తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంకల్ప దీక్ష సభాస్థలాన్ని పరిశీలించిన నాయకులు


నినాదాలు చేస్తున్న జేఏసీనాయకులు

చేర్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేస్తూ ఈనెల 30న చేర్యాల అంగడిబజారు చౌరస్తాలో జేఏసీ ఆధ్వర్యంలో ప్రజాసంకల్ప దీక్ష సభ చేపట్టనున్న స్థలాన్ని బుధవారం జేఏసీ నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్, నాయకులు గిరి కొండల్‌రెడ్డి, కొమ్ము రవి, పుర్మ ఆగంరెడ్డి, తడక లింగమూర్తి, అందె అశోక్, చెరుకు రమణారెడ్డి, మేరుగు కృష్ణ, ఆడెపు చంద్రయ్య, భాస్కర్, మహేశ్ ఉన్నారు.

కార్తీక దీపోత్సవం

చేర్యాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీక దీపోత్సవంలో భాగంగా బుధవారం రాత్రి కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ముఖమడపంలో ఉత్సవమూర్తుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రిశూలం, ఖడ్గం ఆకారంలో జ్యోతులు వెలిగించారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

● డీపీఎం కరుణాకర్


కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డీపీఎం కరుణాకర్

నంగునూరు,నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కనీస మద్దతు ధర కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీపీఎం కరుణాకర్ నిర్వాహకులకు సూచించారు. మండలంలోని అంక్షాపూర్‌లోని కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులదేనని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస సదుపాయాలు కల్పించాలన్నారు. మండలంలో ఇప్పటివరకు ఐకేపీ కొనుగోలు కేంద్రాల ద్వారా ఏడు సెంటర్లలో 829 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఆయనవెంట ఏపీఎం మహిపాల్, సీసీలు లింగం, సాయిలు వీవోఏ విజయ్, కమిటీ సభ్యులు జ్యోతి, సంధ్య ఉన్నారు.

ప్రభుత్వ భూమిలోని నిర్మాణాల తొలగింపు

రాయపోల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం రామారం గ్రామంలోని ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలను మంగళవారం రాత్రి అధికారులు తొలగించారు. రామారం గ్రామ శివారులోని సర్వే నంబరు 481లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రార్థన మందిరాల నిర్మాణం చేపట్టారని ఈ నెల 23న మండల బీజేపీ అధ్యక్షుడు రాజాగౌడ్ రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 24న గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అధికారులతో కలిసి రామారంలో నిర్మాణాలను పరిశీలించారు. ఈ నిర్మాణాలకు సంబంధించి విచారణ చేయాల్సిందిగా రెవెన్యూ అధికారులకు లేఖ రాశారు. సంబంధిత నిర్మాణాలపై విచారణ చేసినట్లు తహసీల్దార్ దివ్య తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టారని తేలడంతో చట్ట ప్రకారం వాటిని కూల్చి వేయించినట్లు పేర్కొన్నారు. అసైన్మెంట్ భూమిని వ్యవసాయం చేసుకోవడానికి మాత్రమే ప్రభుత్వం కేటాయిస్తుందని అలాంటి వాటిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించారు. పోలీసులు రామారం పరిసర ప్రాంతాల్లో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

● పంచాయతీ సెక్రటరీ మాధవ్ జాదవ్

మద్దూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ సెక్రటరీ మాధవ్ జాదవ్ సూచించారు. మండలంలోని రేబర్తిలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన 'విలేజ్ హెల్త్ అండ్ న్యూట్రీషన్ డే' కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా గర్భిణులకు గుడ్లు పంపిణీ చేశార ు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సులోచన, ఏఎన్ఎం. మల్లీశ్రీ, అంగన్‌వాడీ టీచరు జ్యోతి, ఆశాలు కవిత, కనకలక్ష్మి, యశోద పాల్గొన్నారు.


గర్భిణులకు గుడ్లు అందజేస్తున్న సెక్రటరీ

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలి

● జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి


విద్యార్థినిని సన్మానిస్తున్న రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు

చిన్నకోడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వార్షిక పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి సూచించారు. చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించి, అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఇటీవల ఫుట్‌బాల్ క్రీడలో జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థిని చైతన్యశ్రీని శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వంటగది, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: అధికారుల సూచన

చేర్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వంటగది, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. మధ్యాహ్న భోజన నిర్వహణపై మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో మండలంలోని ముస్త్యాల ఆదర్శ పాఠశాలలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు సమీర్ అమీద్‌ఖాన్, ఇన్‌చార్జి ఎంపీడీవో మహబూబ్ అలీ, ప్రత్యేకాధికారి నాగరాజు ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఎప్పటికపుడు మంచినీటి ట్యాంకులను శుభ్రపరచాలని తెలిపారు. అవసరమైన వసతులను గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారా సమకూర్చుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంఈవో కిష్టయ్య ఉన్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గోవర్ధన్‌రెడ్డి



సిద్దిపేట రూరల్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 27: పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో సిద్దిపేట జిల్లా పుల్లూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గోవర్ధన్‌రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అలాగే జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సమ్మయ్య ఎంపికయ్యారు.

సిద్దిపేట గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడిగా కరీమొద్దీన్



గజ్వేల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరీమొద్దీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిద్దిపేట పట్టణంలోని ఇందిరానగర్ జడ్పీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన ఈ సమావేశానికి టీఎస్‌జీహెచ్ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.రాజగంగారెడ్డి హాజరయ్యారు. మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యం ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా కరీమొద్దీన్, ప్రధాన కార్యదర్శిగా రాజిరెడ్డి, కోశాధికారిగా చంద్రశేఖర్‌లు ఎన్నికైనట్లు ప్రకటించారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా అశోక్

హుస్నాబాద్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ మండల అధ్యక్షుడిగా కొలుగూరి అశోక్‌ను నియమించినట్లు ఆ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా నాయకుడు లింగంపల్లి శ్రీనివాస్ తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలో బుధవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధికార ప్రతినిధిగా పొన్నాల వినోద్, ప్రధాన కార్యదర్శిగా బోయిని రాజశేఖర్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా గడిపె కొమురయ్య, అధికార ప్రతినిధిగా కొమ్ము వెంకటేశ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బొజ్జ హరీశ్, యాదగిరి, లక్ష్మీనారాయణ, మల్లేశ్, సంపత్‌కుమార్, చంద్రమౌళి తదితరులున్నారు.

తప్పిపోయిన వృద్ధురాలు.. బంధువులకు అప్పగించిన ఆర్టీసీ సిబ్బంది


వృద్ధురాలు, ఆమె మనమడితో ఆర్టీసీ సిబ్బంది

సిద్దిపేట అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):తమ కూతురు ఇంటికి వెళ్లడానికి బయలుదేరిన వృద్ధురాలు దారి తెలియక సిద్దిపేట కొత్త బస్టాండ్‌లో ఏడుస్తూ కూర్చోవడంతో గమనించిన ఆర్టీసీ సిబ్బంది ఆమెను బంధువులకు అప్పగించిన సంఘటన సిద్దిపేట ఆర్టీసీ కొత్త బస్టాండ్‌లో బుధవారం చోటుచేసుకుంది. ఆర్టీసీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక కొత్త బస్టాండ్‌లో ఎర్రగుంట రాజేశ్వరి (85) అనే వృద్ధురాలు బస్ దిగి ఏడుస్తూ కనిపించింది. ఆమె వద్దకు వెళ్లి విచారించిన సిబ్బంది ఆమె స్వగ్రామం మర్రిముచ్యాలని, ఆమె కూతురి ఊరైన మిరుదొడ్డి వెళ్తూ దారి తెలియక ఏడుస్తున్నట్లు తెలుసుకున్నారు. ఆమెను వినికిడి సమస్య ఉండడంతో వివరాలు తెలుసుకోవడం కష్టంగా మారింది. మిరుదొడ్డి గ్రామ గ్రూపులకు వాట్సాప్ ద్వారా సమాచారాన్ని అందించారు. విషయం తెలుసుకున్న ఆమె మనవడు పరుశరాములు సిద్దిపేట ఆర్టీసీ బస్టాండ్ వద్దకు రాగా డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి బస్టాండ్ ఇన్‌చార్జి రాజేందర్ ఆధ్వర్యంలో ఆమెను అప్పజేప్పారు. దీంతో బంధువులు ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

● చేర్యాల సీఐ ఎల్. శ్రీను

చేర్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలని చేర్యాల సీఐ ఎల్. శ్రీను అన్నారు. చేర్యాల పట్టణంలోని ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం బాలిక, మహిళా రక్షణ చట్టాలు, సైబర్ నేరాల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎల్ శ్రీను మాట్లాడుతూ.. సోషల్‌మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, షీటీమ్ బృందం సైదయ్య ప్రశాంతి, కృష్ణ, శివకుమార్ పాల్గొన్నారు.

● తొగుట: మత్తులో మునిగి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని తొగుట సీఐ లతీఫ్ సూచించారు. మండలంలోని ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నర్సయ్య, అధ్యాపకులు, గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, మహిళా కానిస్టేబుల్ శ్యామల, కానిస్టేబుల్ రామచంద్రారెడ్డి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేరాల కట్టడికి సీసీ కెమెరాలు దోహద పడతాయని మిరుదొడ్డి ఎస్ఐ పరుశురాం అన్నారు. మండలంలోని గుడికందుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఫర్మేషన్ ఎస్ఐ అంబిగల్ల సాయి ప్రసాద్ సహకారంతో బుధవారం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల ఆవరణలో అసాంఘిక, అనైతిక కార్యక్రమాలకు పాల్పడకుండా సీసీ కెమెరాలతో అడ్డుకట్ట వేయవచ్చన్నారు. అంతకు ముందు సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన సాయి ప్రసాద్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నర్సయ్య, ఉపాధ్యాయులు అంజిరెడ్డి, నాగిరెడ్డి, వేణుమాధవ్, హనుమారెడ్డి, కనక రాములు, రవీందర్‌రెడ్డి, శివయ్య, భాస్కర్‌రెడ్డి, పర్వేజ్, లావణ్య, అనసూయ, సీఆర్పీ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.


చేర్యాల: మాట్లాడుతున్న సీఐ ఎల్. శ్రీను

సీపీఆర్ చేసి యువకుడిని కాపాడిన కానిస్టేబుల్

జగదేవ్‌పూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల కేంద్రానికి చెందిన వంటేరు సందీప్‌రెడ్డి ఆర్థిక సమస్యలతో మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నమ్మదగిన సమాచారం మేరకు జగదేవ్‌పూర్ బ్లూ కోట్ కానిస్టేబుల్ లింగం లోకేషన్ ద్వారా సందీప్‌రెడ్డి ఇంటికి వెళ్లి తలుపులు పగులగొట్టి యువకుడిని కిందికి దించాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన సందీప్‌రెడ్డికి వెంటనే సీపీఆర్ చేశాడు. అతడికి స్పృహ రాగానే గజ్వేల్ ఆస్పత్రికి పంపించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం సందీప్‌రెడ్డి ఆరోగ్యం నిలకడానే ఉన్నది. సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ లింగంను సీపీ డాక్టర్ బీ.అనురాధ, ఏసీపీ పురుషోత్తం, ఎస్ఐ చంద్రమోహన్, యువకుడి కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

చెరువులకు 'చెర'

-ఐదో పేజీ తరువాయి

అక్రమంగా తోడేస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో భూగర్భజలాలు పెరగడం లేదని, అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని పిడిచెడ్‌వాసులు కోరుతున్నారు.

ఆక్రమించి.. విక్రయించి..

ఆనాడు ఎంతో వైభవాన్ని కలిగి ఉన్న కొడకండ్లలోని రామరాజు చెరువు ప్రస్తుతం కబ్జా కోరల్లో చిక్కుకున్నది. ఈ చెరువులోని శిఖం భూమిని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించి.. మరో వ్యక్తికి నోటరీ ద్వారా విక్రయించినట్లు సమాచారం. గ్రామంలోని నల్లచెరువు కూడా ఆక్రమణకు గురైందని, స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమ సదరు భూమిని మింగిసేనట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి కబ్జాదారుల చెర నుంచి చెరువులు, కుంటలను విడిపించి రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.